# ఇంత కంటే ఏం చేయను?

విశ్వభరత్



ఆకాశం నలుపు రంగు పులుముకున్నట్లుంది.

రంగారావుగారు వేగంగా అడుగులు వేస్తున్నాడు. స్ట్రీట్ లైట్స్ వెలుగు చీకటిని పూర్తిగా తొలగించలేక పోతోంది.

'ఏ క్షణానయినా వర్షం వచ్చేలాగా వుంది. త్వరగా యిల్లు చేరుకోవాలి' అనుకున్నాడు రంగారావుగారు.

"బాబూగారూ! వర్షం వచ్చేత్తా వుంది.....రిక్షా ఎక్కండి."

గంట మోగిస్తూ అన్నాడో రిక్షావాలా. రంగారావుగారు అవసరం లేదన్నట్లు చెయ్యి వూపి ముందుకు నడిచాడు.

"ఎందుకురా, బసవయ్యా! ఆ అయ్యగార్ని రిక్షా ఎక్కమని అడుగుతావు? నే నిక్కడ పదేళ్లనుండీ రిక్షా వేస్తున్నాను. ఒక్క రోజైనాఈ అయ్య నా బండి కాదు గదా, ఏ రిక్షా ఎక్కలేదు...." వినిపించింది యింకో రిక్షావాలా కంఠం.

రంగారావుగారు నవ్వుకున్నాడు. వీళ్ళ కెందుకో యింత బాధ? ఈ రిక్షా వాళ్ళకే కాదు, తను ఉద్యోగం చేస్తున్నప్పుడు ఆఫీసులోనూ అంతే!

తన నొక పిసినిగొట్టు క్రింద లెక్క వేసేశారు. పైసా కూడా ఖర్చు చేయడనీ, పిల్లికి కూడా బిచ్చం వేయడనీ తనన్ని గురించి నవ్వుకునేవారు.

ఎవరెలా హేళన చేసినా, నవ్వుకున్నా తను లెక్క చేయలేదు. తన ధ్యేయం ఒక్కటే తనలాగా తన కొడుకులు గుమాస్తాలు కాకూడదు. అందుకనే ఉద్యోగంలో చేరినది మొదలు నడిచే ఆఫీసుకు వెళ్ళి వచ్చేవాడు. ఏనాడూ రిక్షా కాని, సిటీ బస్ కాని ఎక్కలేదు.

మధ్యాహ్నం లంచ్ టైములో కాఫీ అయినా త్రాగేవాడు కాదు. సాయంత్రం యింటికి వచ్చాకనే కాఫీ త్రాగేవాడు. తన జీవితంలో చూసిన సినిమాలు రెండే రెండు. ఒకటి నాగయ్యగారి త్యాగయ్య. రెండోది మల్లీశ్వరి! మళ్ళీ అలాంటి సినిమాలు రాలేదు. తనూ చూడలేదు

ఎంత తక్కువలో వీలయితే, అంత తక్కువ ఖరీదులో బట్టలు కుట్టించుకునేవాడు ఇంట్లో ఖర్చుకు కూడా డబ్బు తూచి తూచి యిచ్చేవాడు. పాపం, లక్ష్మి కూడా ఎంతో పొదుపుగా యిల్లు గడిపేది. అవి కావాలి, ఇవి కావాలనేది కాదు.

లోకం తనని పిసినారి అంటేనేం, కొడుకు లిద్దర్నీ ప్రయోజకులని చేశాడు చివరగా పుట్టిన ఒక్కగా నొక్క ఆడపిల్లని తగిన కట్నం యిచ్చి పెళ్ళి చేశాడు బాధ్యతలు తీరాయి. వయసు పుడిగిపోయింది రిటైర్ అయిపోయి పెన్షన్ డబ్బుతో కాలక్షేపం చేస్తున్నాడు.

రంగారావుగారు ఎంత వేగంగా నడిచినా, వర్షం ఆయన యిల్లు చేరే దాకా ఆగలేదు తడిసిపోయి యింటికి చేరిన తండ్రిని చూశాడు కరుణాకరం

'రిక్షాలో రాలేకపోయావా, నాన్నా అన్నాడు తండ్రి స్వభావం తెలిసినా.

రంగారావు నవ్వి, షర్ట్ విప్పి లోపలికి నడిచాడు. లుంగీ కట్టుకుని, తెచ్చిన కూరల సంచీతో వంట యింట్లోకి చేరాడు

"నేను కూరలు తరిగి యిస్తాను .' అన్నాడు అప్పుడే స్నానం చేసి వస్తున్న రెండో కొడుకు సుధాకరం.

'ఎందుకురా, నేను చేయగలను...నువ్వెళ్ళా కూర్చో.." అంటూనే కత్తిపీట తీసుకున్నాడు రంగారావుగారు.

క్షణం ఆగి, నెమ్మదిగా అన్నాడు సుధాకరం 'నాన్నా! వదిన్ని తీసుకువస్తే ఈ వయసులో నీకీ



**ఇటీవల భారతీయ స్టేట్ బ్యాంకు తిరుపతి ప్రాంతీయ కార్యాలయంలో అధికార భాషా సప్తాహం సందర్భంగా కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు బ్యాంకు ప్రతినిధులచే సన్మానం అందుకుంటున్న దృశ్యం. చిత్రంలో కుడి వైపు చివర వారు భారతీయ స్టేట్ బ్యాంకు ప్రధాన ప్రాంతీయ అధికారి శ్రీ కె. శంకర నారాయణన్.**

అవస్త వుండదుకదా?'

తండ్రి సమాధానం కోసం ముందు గదిలో కూర్చున్న కరుణాకరం కూడా చెవులు రిక్కించాడు.

ఎప్పటిలా మౌనం వహించిన తండ్రినేమీ అనలేక సుధాకరం విసుగ్గాలేచి ముందు గదిలోకి వచ్చేశాడు.

"ఈయనగారు బ్రతికుండగా వదిన కాపురానికి రాదు రానివ్వడు! మన ఖర్మ లింతే!" తండ్రికి వినిపించనంత చిన్న కంఠంతో అనేసి వార పత్రిక అందుకున్నాడు సుధాకరం.

నిట్టూర్పుని అణచుకున్నాడు కరుణాకరం. పైకి జీవం లేని నవ్వొకటి పెదవులపై దొర్లించాడు.

* * *

"రంగారావ్!

నీకు త్వరలో చావు తప్పదు!"

కవరు చించిన రంగారావు తెలుగులో టైప్ చేయబడిన ఆ రెండు వాక్యాలూ చదివి తెల్లబోయాడు.

ఎవరు వ్రాశారీ ఉత్తరం? సంతకం లేదు. పావు తావు తెల్ల కాగితాన్ని సగం చేసి, దానిమీద టైప్ చేశారు.

"నీకు త్వరలో చావు తప్పదు!"

**అంటే తనని చంపేస్తారా? ఎవరు? తన మీద అంత కక్ష ఎవరికి వున్నది? తనకి శత్రువు లెవరున్నారు? తనకేమీ ఆస్తి లేదు. తనకి శత్రువులుండే అవకాశం లేదే?**

**ఉద్యోగం చేసినంత కాలం తనెవర్నీ ఏవిధంగానూ బాధ పెట్టలేదు. తన తోటి గుమాస్తాలు లంచం చేతిలో పడనిదే ఫైళ్ళు ముట్టుకునే వారు కాదు. తనెప్పుడూ ఎవర్నీ లంచం అడగలేదు. బయట ప్రపంచంలో కూడా తనకి ఎవరితోనూ స్నేహాలు లేవు. పరిచయాలు కూడా అంతంత మాత్రమే. తన కంటే ముందే రిటైర్ అయిన కోదండంతో మాత్రం కొంచెం స్నేహంగా వుండేవాడు.**

ఒకసారి వాడు రెండు వందల రూపాయలు అప్పు

## ఇంతకంటే ఏం చేయను ?

**అడిగితే తను యివ్వలేదు. యివ్వలేదని వాడికి చాలా కోపం వచ్చింది. కాని అదెప్పటి విషయం? మూడేళ్ళనాటి సంగతి! ఆ కోపం యింకా మనసులో వుంచుకుంటాడా? కక్షగా యిలా బెదిరిస్తూ ఉత్తరం వ్రాస్తాడా? ఛ....ఛ....ఎవరికయినా చెబితే విని నవ్వతారు!**

ఎంత ఆలోచించినా తన మీద కక్షవున్న తన శత్రువు ఎవరో అంతుబట్టలేదు. వృథాగా తమ బుర్ర చెడగొట్టుకుంటున్నాడు. ఇది ఎవరో హాస్యానికి రాసి వుండాలి.

రంగారావుగారు చిన్నగా నవ్వుకుని, కవరూ, ఉత్తరమూ దాచేసి, దుప్పటి మెడదాకా కప్పుకుని కళ్ళుమూసుకున్నారు.

* * *

చెప్పులు బల్లకిందకు తోస్తూ, "జ్యోతీ! కాసిని మంచినీళ్ళు యివ్వమ్మా!" అన్నాడు రామచంద్రమూర్తి. షర్టు విప్పి హేంగర్‌కి తగిలించి, లుంగీ తీసుకున్నాడు

"అబ్బ! ఈ రోజు ఆరుగంటలు కావస్తున్నా ఎండవేడి తగ్గలేదు కదూ?" అడిగాడు చెల్లెల్ని.

ఆమెనుంచి జవాబు రాక పోవటంతో పక్కకు తిరిగి చూశాడు జ్యోతి కూర్చున్న చోటునుంచి కదలలేదు. ఆమె చూపులు ఎటువైపు నిలిచాయో చూశాడు మూర్తి.

ఎదురింటి నవదంపతులు చక్కగా ముస్తాబై సినిమాకు కాబోలు బయల్దేరారు. అతను స్కూటర్ స్టార్ట్ చేస్తున్నాడు ఆమె మురిపెంగా భర్తవైపు చూస్తోంది. అతను సైగ చేయగానే వెనుకసీటు మీద కూరుచంది. స్కూటర్ కదిలి ముందుకు వెళ్ళిపోయింది

చిన్నగా నిట్టూర్పు వదులుతూ జ్యోతిని సమీపించి ఆమె తలపై చెయ్యివేశాడు ఉలిక్కిపడి తలెత్తి అన్నగారి కళ్ళల్లోకి చూసి చటుక్కున తల దించుకుంది. ఆ కళ్ళల్లో నీళ్ళు మూర్తి దృష్టిని దాటిపోలేదు

కుర్చీలోనుంచి వంటగదిలోకి వెడుతూ "కాఫీ తెస్తాను" అంది జ్యోతి. ఆ కుర్చీలోనే కూలబడి, తలవెనక్కి వాల్చి కళ్ళు మూసుకున్నాడు మూర్తి.

జ్యోతి మనసులో ఆవేదనా, తన మనసులో దిగులూ ఒక్కటే! అదే జ్యోతి సంసారం గురించి!

పెళ్ళయిన ఏ నవ వధువుకు వుండదు భర్తతో అలా సరదాగా సినిమాలకు, షికార్లకూ వెళ్ళాలని? కాని, జ్యోతి ఆ కనీస అదృష్టానికి కూడా నోచుకోలేదు

తన తండ్రి బ్రతికుండగానే జ్యోతి పెళ్ళి చేశాడు సంబంధం కూడా మంచిదే జ్యోతికి అత్తగారులేదు. ఆడపడుచుకి పెళ్ళి అయిపోయింది. ఒక్క మరిది మామగారికి పిసినారి అని పేరున్నా అందువల్ల జ్యోతికి వచ్చే నష్టం ఏముందన్నారు అందరూ. కాని అదే యిప్పుడు జ్యోతి పెళ్ళయి కూడా కాపురానికి వెళ్ళకుండా ఆటంకమయింది

"కట్నం బాపతు డబ్బు సగమే సమకూడింది. మిగిలింది తన పెన్షన్ కాగితాల పని పూర్తి కాగానే యిస్తానని ఒక్కపదిరోజులు గడువు చాలని' నాన్న వెళ్ళి జ్యోతి మామగారితో చెప్పాడు. పాపం. ఆయనా కాదనలేదు పెళ్ళి సలక్షణంగా జరిగిపోయింది. అందరూ జ్యోతి అదృష్టాన్ని పొగిడారు

'మిగిలిన కట్నం డబ్బుతోనే జ్యోతిని తన ఇంటికి పంపమని, ఆ తరువాతనే మిగిలిన శుభకార్యం జరుపవచ్చునని 'జ్యోతి మామగారు' నిక్కచ్చిగా చెప్పేశారు

నాన్న అధైర్యపడలేదు. 'ఎంత? ఒక్కపది రోజులేకదా? పోనీ ఈ పది రోజులూ నా చిట్టి తల్లి నాకళ్ళ ముందు వుంటుంది,' అన్నారు. కాని వెదుక్కుంటూ వచ్చిన అదృష్ట దేవత వెనక్కి మళ్ళింది ఆ పది రోజులలోనే.

అకస్మాత్తుగా నాన్న ఆరోగ్యం తిరగ బెట్టింది. ఆపరేషన్ చేయాల్సిందే అన్నారు రావల్సిన డబ్బు రానే వచ్చింది ఆపరేషన్‌కి ఖర్చయిపోయింది. **అటు** జ్యోతి కాపురం కూలిపోయింది. ఇటు నాన్నా దక్కలేదు!

వియ్యంకుడు పోయాడని తెల్సి చూడటానికి వచ్చాడు జ్యోతి మామగారు. తనకి రెండు సానుభూతి మాటలు చెప్పి, 'కట్నం బాపతు డబ్బు యిస్తే జ్యోతిని తీసుకువెడతానని అన్నాడు.

ఆయన రెండు చేతులూ పట్టుకున్నాడు తను. "మామయ్యగారూ! మీరు కనికరించాలి. వచ్చిన డబ్బు నాన్నగారి వైద్యానికి ఖర్చయిపోయింది. చెల్లాయిని తీసుకువెళ్ళండి. సంసార జీవితంలోపడి, నాన్నగారిపై దిగులు మరచిపోతుంది. నేను రెండు నెలలాగి మీకు సర్దుబాటు చేస్తాను ." అన్నాడు.

"చూడు, మూర్తీ! నేను నిక్కచ్చి మనిషిని! ఆ డబ్బు ఖర్చయి పోయిందంటే నేను కాదనను. మీ నాన్నలేడు. నీవా, చిన్నవాడివి. చిన్న ఉద్యోగం! ఎక్కడని తేగలవు? ఎలా? తీసుకు రాగలవు? అప్పు నీకు యిచ్చే వారయినా ఏం చూసి యిస్తారు? ఎలా

తీరుస్తావని యిస్తారు? రెండు నెలల్లో నువ్వు నాలుగువేలు కాదుగదా, నాలుగు వందలయినా యివ్వలేవు అందువల్ల నీమాట నమ్మను. నా కోడల్ని తీసుకు వెళ్లను నన్ను కర్కోటకుడనుకున్నా సరే!రాక్షసుడనుకున్నా మంచిదే ..." అనేసి వెళ్లిపోయాడాయన.

నిజమే తనది చిన్న ఉద్యోగం. వచ్చే మూడు వందల రూపాయలలో యింటద్దె అరవయి రూపాయలు పోగా, మిగిలిన దానిలో రెండు పూటలా తినడమే కష్టం. అలాంటిది తను ఏం కూడబెట్ట-గలడు? అప్పు తెచ్చినా ఎలా తీర్చగలడు?

మరోసారి వెళ్లి చెల్లెలి మామగారిని ప్రాధేయ పడ్డాడు తను. కాళ్ళు పట్టుకుని బ్రతిమలాడేడు తన చెల్లెలి జీవితం నాశనం చేయవద్దని. కాని ఆ కర్కోటకుడు విన్లేదు.

ఆ తరువాత ఎంత తిరిగినా, ఎందర్ని అడిగినా అప్పు పుట్టించలేకపోయాడు. సంవత్సరం దాటి-పోయింది.'మీ నాన్నగారు పోయి ఏడాది కదా?నువ్వో పెళ్లిచేసుకో! ఆ కట్నం డబ్బుతో కొంత నీ చెల్లెలికి యిచ్చి పంపించు ...' అని సలహా యిచ్చారు కొందరు

తను కట్నం తీసుకోవటమా? కట్న పిశాచి ఎంత భయంకరమైనదో స్వయంగా అనుభవిస్తూ, తను వరకట్నం ఎలా తీసుకోగలడు? తను ఆదర్శ వివాహం చేసుకోవాలంటే జీతం పెరగాలి. లేదా ఇంకో మంచి ఉద్యోగం రావాలి!

కాని జ్యోతి జీవితం ఏమవుతుంది? సుఖంగా భర్తతో సంసారం చేస్తూ వుండాల్సిన చెల్లాయి నిరాశా నిస్పృహలతో రోజులు వెళ్ళ బుచ్చుతూ వుంటే చూస్తూ ఊరుకోవటం ఎలా?

ఏం చేయాలి? ఏంచేసి. జ్యోతిని అత్తవారింటికి పంపగలడు? జ్యోతి భర్త, అమె మరది మంచివారే కాని తండ్రి కెదురు చెప్పలేరు. అసలు అభ్యంతరమూ వున్నదల్లా జ్యోతి మామగారి వల్లనే!

ఆలోచిస్తూ కూర్చుండి పోయిన మూర్తి ఏదో నిశ్చయానికి వచ్చినట్లు ఊపిరి వదిలాడు. కాఫీ గ్లాసుతో వచ్చిన చెల్లెలి వైపు నవ్వుతూ చూశాడు.

"రంగారావ్!"

నీకు సరిగ్గా పదిరోజులలో చావు తప్పదు!సాక్షాత్తు కగవంతుడే దిగివచ్చినా, నీ ప్రాణం పోకుండా ఆపలేడు. కనుక ఈ లోగా నీవు చేయాల్సిన మంచి-పనులన్నీ పూర్తి చేసుకో ..."

మొదటి ఉత్తరంలాగానే ఇదీ పావుతావు కాగితంలో సగం ముక్క పైన తెలుగులో టైపు చేయబడింది. కవరు మీద అడ్రసు కూడాఅంతే!

రంగారావుగారి మొహమంతా చిరు చెమటలు పట్టాయి. ఇది రెండో ఉత్తరం. మొదటిది ఎవరో అల్లరిగా వ్రాశారనుకున్నాడు తను. ఇదీ అలాగే అనుకోవాలా?

తన కెలాంటి జబ్బులేదు. అరవై దాటినా పిడిరాయిలా వున్నాడు. మరి ప్రాణం పోవటం ఎలా సంభవం?

ఏమో? నిమషాలమీద ఏ హార్ట్ ఎటాక్ లాంటిదో

## నిచ్చెనలు

ప్రయత్నంచెయ్యక

ఫలితాల కోసం దేవుని ప్రీతికి

చేసే మానవుల అర్చనలు

అందని ఆకాశానికి నిచ్చెనలు!

– ఎన్. వి. ఆర్. ఎస్. మూర్తి

వచ్చి, తన ప్రాణం పోవచ్చు ఎంతసేపు గుక్కెడు ప్రాణం పోవటానికి?

అశాంతిగా చెప్పులు వేసుకుని యింట్లోంచి బయటకు నడిచాడు రంగారావుగారు. అలవాటుగా ఆయన కాళ్ళు పార్కువైపు దారి తీశాయి. మూలగా వున్న బెంచీమీద చతికిల బడ్డాడు. మొహాన పట్టిన చిరుచెమట్లు చల్లని గాలికి ఆరిపోతున్నాయి.

నిజంగా ఆ ఉత్తరంలో వున్నట్లు తనకు పదిరోజులలో చావు తప్పకపోతే ఆలోగా చేయాల్సిన మంచి పనులేమిటి?

రెండోవాడు సుధాకరానికి కూడా పెళ్లి చేసేయాలి. అంతకంటే యిప్పుడు ...

"ఈ మధ్య మన ఊళ్లోకి కొత్త జ్యోతిష్కు-డొకాయన వచ్చాడుట. ఆయన దగ్గరకు ప్రత్యేకించి వెడితే ఏమీ చెప్పడుట. ఫీజు తీసుకునే ప్రసక్తేలేదు. ఎవరికయినా ప్రాణగండం లాంటిది వుందంటే అది ఆయనకు వారి మొహం చూస్తే తెలిసిపోతుందట. ఆ మనిషికి నోటితో చెప్పకుండా ఉత్తరం ద్వారా తెలియ జేస్తాడుట. ఈ మధ్య మన వూరి రైస మిల్లు ఓనర్‌కి అలాగే తెలియజేశాడుట ఆ జ్యోతిష్కుడు. ఆ తరువాత కాలేజీ ప్రిన్సిపాల్‌గారికి అంతేనుట! ఇద్దరూ ఆ ఉత్తరాలలో తెలియజేసినట్లే పోయారుట ...!"

అని వినిపించి తలెత్తాడు రంగారావుగారు. ఇద్దరు యువకులు ఆయన ముందు నుంచి వెడు-తున్నారు. వాళ్లని ఆపి, "బాబూ! ఆ జ్యోతిష్కు-డెవరో తెలుసునా మీకు?" అని అడిగాడు.

"తెలియదండీ, మేమూ చూడలేదు. ఆయన గురించి వింటున్నాం ... అంతే!" అన్నాడు ఒక యువకుడు.

"అలాగా!" అంటూ వెనక్కి వచ్చి కూర్చున్నాడు రంగారావుగారు. ఇద్దరు యువకులూ ఆయనకేసి ఓసారి చూసి వెళ్లిపోయారు.

మసక చీకట్లో కూర్చున్న రంగారావుగారు ఒక నిశ్చయానికి వచ్చారు పది రోజులలో తను చావవచ్చు. సుధాకరం పెళ్ళికాదు. తను చేయవల్సిన మంచి పని ... మరొకటి వుంది . అది ..

* * *

కిర్రు చెప్పుల చప్పుడు విని, తలెత్తిన జ్యోతి చివాలున లేచి నిలబడింది. పైటకొంగు భుజాల మీదుగా లాక్కుంది.

లోపలికి వచ్చిన రంగారావుగారు అలసటగా కుర్చీలో కూలబడ్డాడు. వంటగదిలోకి ఒక్క ఉరుకులో వెళ్లి, మర చేంబుతో మంచి నీళ్ళూ, గ్లాసు తెచ్చి ఆయన ముందు వుంచి, "కాఫీ తెస్తాను" అని మళ్లీ పరుగెత్తబోయిన జ్యోతిని "వద్దమ్మా" అని ఆపు చేశాడు రంగారావుగారు.


గ్లాసెడు మంచి నీళ్ళు తాగి, కండువాతో మొహం తుడుచుకున్నాడు "మూర్తి రేదమ్మా?" అడిగాడు నెమ్మదిగా

"లేదు, మామయ్యగారూ! అన్నయ్య ఆఫీసు పని మీద విశాఖపట్నం వెళ్లాడడు. వారం దాకా రాడు ..." వినయంగా జవాబిచ్చిన కోడలిని చూశాడు రంగారావుగారు.

"అలాగా! ఫరవాలేదులే నీ బట్టలన్నీ సర్దుకో .. రాత్రికే వెళ్లిపోదాం ..." అంటున్న మామగారి వైపు విభ్రాంతితో చూసింది జ్యోతి

"అన్నయ్యలేదు .. అంతేకాదు ... కట్నం డబ్బు ..."

నవ్వాడు రంగారావుగారు. "నేను కర్కోటకుడ్నీ, డబ్బు మనిషినీ కాదమ్మా! డబ్బు జాగ్రత్త మనిషిని అంతే! నా కూతురుకి నిక్కచ్చిగా కట్నం యిచ్చిన వాడిని, నాకొడుక్కీ అంత నిక్కచ్చిగానూ కట్నం తీసు-కోవాలన్నది నా పట్టుదల. కాని యిప్పుడు మీరు యివ్వలేని పరిస్థితిలో వున్నారు. నేనెంతకాలం బ్రతుకుతానో తెలియదు నా పట్టుదలకోసం మీ



# ఇ'వేమన' పద్యాలు




తామసించి చేయ తగదెట్టి కార్యంబు
వేగిరింపనదియు విషమ మగును
పచ్చికాయదెచ్చి పడవేయ ఫలమౌనె
విశ్వదాభిరామ వినురవేమ.

యిద్దర్నీ విడదీయటం ధర్మంకాదు. సుధాకరం పెళ్ళి కూడా నిశ్చయమైంది. యివ్వగలిగినంతే కట్నం యివ్వమన్నాను వాడిని కూడా ఓ యింటివాడిని చేస్తే నేనేమయిపోయినా ఫరవాలేదు. యింటికి పెద్ద కోడలివి నీవు లేకుండా పెళ్ళి చేయటం ఎలా? ఇవాళ ఏడో తారీఖు. పదకొండున పెళ్ళి. బయల్దేరమ్మా! మీ అన్నయ్యకి ఒక ఉత్తరం వ్రాసి పెడదాం – నేనా పని చేస్తాను నువ్వీలోగా నీ పెట్టె సర్దుకో ." అంటున్న మామగారిని సజల నేత్రాలతో చూసింది జ్యోతి

## ఇంతకంటే ఏం చేయను ?

"పెళ్ళి పనులతో బాగా అలసిపోయినట్లున్నావు?" నవ్వాడు కరుణాకరం. తల అడ్డంగా తిప్పింది జ్యోతి.

"నాకేమి అలసటగాలేదు. ఎంతో ఆనందంగా వుంది ..."

"కారణం ఏమిటో ...?" తెలియనట్టే అడిగాడు కరుణాకరం.



క్షణకాలం మౌనంగా వుండిపోయింది జ్యోతి "నేనీ యింటికి వస్తానని, పెద్ద కోడలిగా నాకీ అదృష్టం, గౌరవం ఈ జన్మలోను. మామగారి మనసు మారుతుందన్న ఆశలేదు నాకు. మీరూ, నేనూ కలిసి కాపురం చేస్తామన్న నమ్మకం నశించిపోయింది ఏ దేవుడు ఆయన మనసు మార్చాడో."

*　　*　　*

"ఏ దేవుడు ఆయన మనస్సు మార్చాడో కాని, నేను మాత్రం ఈ జన్మలో మన పెళ్ళి అవుతుందని అనుకోలేదు." అంది సరళ

ఆమె చెయ్యి అందుకుని, గాజులు సవరిస్తూ చిన్నగా నవ్వాడు సుధాకరం. "ఏ దేవుడూ ఆయన మనసు మార్చలేదు .. నేనే ఆయన మనసు మార్చాను ..."

"నిజంగానా? ఎలా మార్చావ్, సుధా?" ఆశ్చర్యంగ అడిగింది సరళ.

క్షణకాలం నిటారుగా కూర్చున్నాడు సుధాకరం "మా నాన్న మనసు మార్చటం నిజానికి ఆ దేవుడువల్ల కూడా కాదనే నానమ్మకం. వివాహమయి కూడా అన్నయ్యా, వదినా చెరోచోటా నిస్సారంగా కాలం గడుపుతున్నారు. వారి ఎడబాటుకు కారణం మానాన్న – ఆయన కట్నం పిచ్చి! ప్రేమించుకున్న మనమే దూరంగా వుండాలంటే ఏదోగా ఫీలవుతున్నాం. అలాంటిది అన్నయ్యకూ వదినకూ ఎలా వుంటుంది?ఇక భర్తతో కలిసి సంసారం ఆశలేదని నిరాశతో వదిన ఆత్మహత్యకు పూనుకుంటే ..

మనం తెగించి పెళ్ళి చేసుకోగలం. కాని మా నాన్న మనసు మారాలి! అన్నయ్య కూడా సుఖపడాలి. అందుకని చిన్న ప్లాన్ వేశాను. ఎవరికైనా ప్రాణభయం సహజం. ప్రాణంపోయేలోగా మంచివాడని ఉనిపించుకోవాలన్న నైజంలేని వారు అరుదు. మా నాన్నకు నేను 'నీకు త్వరలో చావు తప్పదు' అని ఒకసారి, 'పది రోజులలో చావు తప్పదు' అని రెండోసారి ఉత్తరాలు పోస్టు చేశాను ఆ ఉత్తరాలకు సపోర్ట్‌గా ఎవరో జ్యోతిష్కుడు వ్రానే ఉత్తరాలలోని విధంగా జరుగుతున్నట్లు నా ఫ్రండ్స్ చేప్పుకుంటున్నట్లు ఏర్పాటు చేశాను ..." అని క్లుప్తంగా చెప్పి, "దాంతో మా నాన్నకు ప్రాణ భయం పట్టుకుంది. ప్రాణంపోయేలోగా మంచివాడనిపించుకోవాలని, కొడుకులిద్దర్నీ సుఖపెట్టాలని ఈలోచన కలిగింది. మనసు మారింది. మన పెళ్ళి నిశ్చయంచేసి, ఆయనే వెళ్ళి వదిన్ని తీసుకువచ్చారు. కొడుకుగా నేనలా చేయటం బాగుండకపోవచ్చు. కాని ఆయనలో మార్పు తెచ్చి, మనం అందరం సుఖంగా వుండాలంటే ఇంతకంటే ఏం చేయను?" అన్నాడు.

"చేసింది చాల్లే. రేపు మామయ్యకు నిజం చెప్పేయ్. లేకపోతే దిగులుతో ..." అంటున్న సరళని దగ్గరకు లాక్కున్నాడు సుధాకరం.

"చేసిన తప్పంతా నోటితో చెప్పలేక ఇంతక్రితమే ఉత్తరం వ్రాసి ఆయన లాల్చీ జేబులో పెట్టాను. చాలదూ?" అని నవ్వి, ఆమె రెండు బుగ్గలూ తమకంతో చుంబించి, "నువ్వు యిప్పుడు చెప్పు ... యింతకంటే ఏం చేయను?" అడిగాడు సుధాకరం చిలిపిగా. □